# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 258
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జూలై 15, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## ఘనంగా శ్రీదీప్ ఆర్యన్ పుట్టినరోజు వేడుకలు

- ఆశీర్వదించిన గడ్డం కేశవమూర్తి-సంధ్యారాణి దంపతులు, బంధువులు

8లో..



8లో..

## నిరుపేదలకు కాంగ్రెస్ అండ

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- లబ్దిదారులకు చెక్కుల పంపిణీ



8లో..

## పనులు సకాలంలో పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వరంగల్ కలెక్టరేట్ నిర్మాణ పనుల పరిశీలన



2లో..

## ప్రత్యూష మృతి కేసులో నలుగురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** యువ వైద్యురాలు అల్లాడి ప్రత్యూష ఆత్మ హత్యకు కారకులైన నలుగురిని హసన్ పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని కాకతీయ వెంటేజ్ లోని స్వగృహంలోనే వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన (మిగితా 2లో..)

# భక్తి ముసుగులో.. దోపిడీ



హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని ఉరుగొండ గ్రామ శివారులో కొలువై ఉన్న శివ నాగేంద్ర స్వామి ఆలయంలో భక్తి ముసుగులో దోపిడీకి తెరలేపినట్లు ప్రచారం సాగుతోంది. వివిధ సమస్యలనుంచి గట్టెక్కించాలంటూ స్వామి వారిని వేడుకునేందుకు వచ్చిన భక్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొంటున్న కొందరు ప్రైవేట్ వ్యక్తులు రకరకాల పూజల పేర్లతో నిలువు దోపిడీ చేస్తున్నట్లు సమాచారం. భక్తుల కోరిన కోర్కెలు తీరడంతో ఏటేటా ఇక్కడికి వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఉరుగొండ గ్రామ శివారువారే కాకుండా హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. సాధారణంగా ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో శివ నాగేంద్ర స్వామి దర్శనానికి భక్తులు వస్తుంటారు. ఇక శ్రావణ మాసం, కార్తీక మాసంలో స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తుతుంటారు. హైవేనుంచి ఆలయం వరకు అర కిలోమీటర్ పొడవునా వివిధ దుకాణాలు ఏర్పాటు చేసి తమ విక్రయాలను కొనసాగిస్తున్నారు. భక్తుల రద్దీ పెరుగుతున్న కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆలయ నిర్వాహకులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పవచ్చు. భక్తుల నుంచి ఎంత ఆదాయం వస్తుందనే ధ్యాస తప్ప ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచన వారికి లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకొని భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

– వరంగల్ వాయిస్, దామెర



- శివ నాగేంద్ర స్వామి ఆలయంలో ఇష్టారాజ్యం
- ఏటేటా పెరుగుతున్న భక్తులు
- దోచుకుంటున్న ప్రైవేట్ వ్యక్తులు
- కనీస వసతులు కల్పించడంలో నిర్వాహకుల విఫలం
- ఇబ్బందులు తప్పడంలేదంటున్న భక్తులు

# భక్తి ముసుగులో.. దోపిడీ









- శివ నాగేంద్ర స్వామి ఆలయంలో ఇష్టారాజ్యం
- ఏటేటా పెరుగుతున్న భక్తులు
- దోచుకుంటున్న ప్రైవేట్ వ్యక్తులు
- కనీస వసతులు కల్పించడంలో నిర్వాహకుల విఫలం
- ఇబ్బందులు తప్పడం లేదంటున్న భక్తులు

**వరంగల్ వాయిస్, దామెర :** దామెర మండల పరిధిలోని ఉరుగొండ గ్రామ శివారులో శివుడు, నాగేంద్ర స్వామి కొలువై ఉన్న ఆలయ ప్రాంగణమే శివ నాగేంద్ర స్వామి ఆలయం. ఈ ఆలయంలో మొదటి మొక్కులు వినాయకుడికి చెల్లించుకున్నాక ఇతర దేవతలను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. రెండు భారీ వృక్షాల కింద నాగేంద్ర స్వామి కొలువై ఉన్నట్లు భక్తుల నమ్మిక. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి కూడా భక్తులకు దర్శని ఇస్తున్నారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చుతూ వారి కొంగు బంగారంగా వెలుగొందుతున్న శివ నాగేంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏడు పెరుగుతోంది.

## నిలువు దోపిడి..

శివ నాగేంద్ర స్వామిని దర్శనం చేసుకుందామని వచ్చే భక్తులకు ఇక్కడ నిలువు దోపిడీ తప్పడం లేదు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం మరిచిన నిర్వాహకులు తమ జేబులోకి వచ్చే ఆదాయంపైనే దృష్టి సారిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ములుగు రోడ్డునుంచి పర్కాల వెళ్లే ప్రధాన రహదారి నుంచి కిలో మీటరు దూరంలో వ్యవసాయ పొలాల్లో కొలువై ఉన్న స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు మంగళ, శుక్ర వారాల్లో అధికంగా తరలి వస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకున్న నిర్వాహకులు వాహన పార్కింగ్, దర్శనం పేరిట దోపిడీకి పాల్పడుతన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భక్తుల విశ్వాసాలను ఆసరాగా చేసుకుని నిలువు దోపిడీకి గురవుతున్న భక్తులు ఆరోపిస్తున్నారు. సదరు ప్రైవేట్ వ్యక్తుల కనుసన్నల్లోనే ఇక్కడ వ్యాపారాలు నిర్వహించాలంటూ హుకుం జారీ చేయడంతో చిరు వ్యాపారాలు చేసుకునేవారు నష్టపోతున్నట్లు భక్తులు పేర్కొంటున్నారు. వారే స్వామి వారి ఫోటోలను విక్రయించడం కూడా విమర్శలకు దారి తీస్తుంది. ఏవైనా సమస్యల్లో ఉన్న వారు మూడు లేదా ఐదు వారాల పాటు స్వామి వారి ఫోటోను ఇంటిలో పెట్టుకుంటే కలిసి వస్తుందంటూ నమ్మబలికి అధిక రేటుకు విక్రయిస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దేవాదాయ శాఖ స్పందించాలి..

రోజు రోజుకూ భక్తుల రద్దీ పెగుతున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అదే విధంగా భక్తులకోసం రహదారి సౌకర్యంతోపాటు పార్కింగ్, ఇతర సదుపాయాలు కల్పించడం ద్వారా భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సంఖ్య కూడా అధికంగా ఉన్నందున దేవాదాయ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# ప్రత్యూష మృతి కేసులో నలుగురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి



**(మొదటి పేజి తరువాయి..)** విలేఖరుల సమావేశంలో కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి వివరాలు వెల్లడించారు. డాక్టర్ ప్రత్యూష మృతికి కారకులైన భర్త డాక్టర్ అల్లాడి సృజన్, అతని తల్లితండ్రులు అల్లాడి మధుసూదన్, అల్లాడి పుణ్యవతితోపాటు బానోతు శృతి కారులో హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలో వెళ్తుండగా కాకతీయ వెంటేజ్ క్రాస్ సమీపంలో హసన్ పర్తి పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. మాటలతో ప్రేరేపించి డాక్టర్ ప్రత్యూష మరణానికి కారకులైన ఈ నలుగురిని కోర్టులో హాజరుస్తున్నట్లు ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సీఐ చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవి, క్రైమ్ కానిస్టేబుల్స్ క్రాంతి, వివేక్ పాల్గొన్నారు. అయితే అల్లాడి ప్రత్యూష ఆత్మహత్యకు ప్రేరేపించిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ వారిని విలేఖరుల ముందు హాజరు పర్చకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

## ప్రత్యూష కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

ఆత్మహత్య చేసుకున్న డాక్టర్ ప్రత్యూష కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ అర్బన్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఆర్. దిలీప్ రాజ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంగళవారం వారి నివాసానికి వెళ్లి ప్రత్యూష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. చట్టరీత్యా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చి మనోధైర్యం కల్పించారు.



# శాకంబరిగా రేణుక ఎల్లమ్మ

- బాలాజీ నగర్ లో ఘనంగా వేడుకలు

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ పట్టణం మూడో వార్డు పరిధిలో ఉన్న బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఆషాడమాసాన్ని పురస్కరించుకొని వైభవోపేతంగా శాకంబరి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారు శాకంబరి అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. కాలనీలోని మహిళా భక్తులు బోనాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి జలకడ వడలతో కలశాలతో అభిషేకాలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, అందరు పిల్లాపాపలతో చల్లగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాలనీ పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# దేశాన్ని రక్షించేది కమ్యూనిస్టులే

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి
◆ నర్సంపేటలో ఘనంగా సీపీఐ మండల మహాసభలు



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** దేశాన్ని రక్షించేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన సీపీఐ మండల 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నర్సంపేట పట్టణంలోని మేరా భవన్‌లో గడ్డం నాగరాజు, పిట్టల సతీష్ అధ్యక్షతన ఈ మహాసభ ఘనంగా జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ, మతతత్వ రాజకీయాలతో బీజేపీ దేశ ప్రజలను విభజిస్తోందని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నారని, ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్ శక్తులకు దాసోహం అయిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, ప్రజాస్వామ్య గొంతుకను అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్రం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కుతోందని, రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతోందని అన్నారు. జాతీయవాదం పేరుతో హిందుత్వ ఎజెండాతో ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులపై విషం కక్కుతూ ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, ఆకలి, దారిద్రం నిరంతరం పెరుగుతున్నా, పేదలకు విద్య, వైద్యం అందక ప్రజలు ఆందోళనకు గురవుతున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ కగార్' పేరుతో కేంద్రం ఆదివాసీలను హత్య చేస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఫాసిస్ట్ చర్యలను మేధావులు, విద్యార్థులు ఐక్యంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. తొలుత సీపీఐ సీనియర్ నాయకులు సుంకరనేని బాలనరసయ్య అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మహాసభలలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాసు మియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపల్లి రమేష్, గుంపెల్లి మునిశ్వరుడు, గుండె బద్రి, తోట చంద్రకళ, మండల నాయకులు పాల్గొన్నారు.

# కొత్తకొండ వీరభద్ర స్వామి హుండీ లెక్కింపు

## ఆదాయం రూ. 5.73 లక్షలు



**వరంగల్ వాయిస్, కొత్తకొండ :** కొత్తకొండలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం ఆలయ ఆవరణలో మంగళవారం జరిగిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో రూ. 5,73,374 (ఐదు లక్షల డెబ్బై మూడు వేల మూడు వందల డెబ్బై నాలుగు రూపాయలు) ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ కిషన్ రావు తెలిపారు. హుండీ ఆదాయంలో నోట్లు రూ. 5,23,860 కాగా, నాణేలు రూ. 49,514 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సంజీవ రెడ్డి, స్థానిక నాయకులు పిడిశెట్టి కనకయ్య, పూదరి రవీందర్ గౌడ్, సదానందం, యాటపోలు శ్రీనివాస్, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సిరిసిల్ల సభ్యులు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు, శ్రీకాంత్, అర్చకులు రమేష్, సందీప్, శివకుమార్, శరత్‌చంద్ర, శ్రావణ్, సిబ్బంది రవీందర్, నారాయణరావు, శ్రీధర్, అనూష, రాజు, రాజేందర్, భక్తులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సమావేశం

## హాజరైన ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** ఎనుమాముల మార్కెట్, వరంగల్‌లో ఉమ్మడి వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో అమలు చేసిన అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపై చర్చించారు. రైతులు, రైతు కూలీల కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన పెంచే అంశాలపై, అలాగే వ్యవసాయ మార్కెట్లలో చేసిన, చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, పరకాల చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ములుగు చైర్మన్ రేగ కళ్యాణి, జనగాం చైర్మన్ బనుక శివరాజ్, ఘనపురం చైర్మన్ జే లావణ్య, కేసముద్రం చైర్మన్ గంట సంజీవ రెడ్డి, నెక్కొండ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి, చేర్యాల చైర్మన్ నల్ల నాగుల శ్వేత, వర్ధన్నపేట చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిన నేపథ్యంలో కమలాపూర్‌లో హుజురాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు జరిగాయి. ప్రజా నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ ఓడితెల ప్రణవ్ బాబులకు కృతజ్ఞతగా మండల కేంద్రంలో పాలాభిషేకం నిర్వహించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని యువజన కాంగ్రెస్ హుజురాబాద్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ ధర్మల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోడేటి భిక్షపతి, మౌటం కుమారస్వామి, మాట్ల రమేష్, తడక శ్రీకాంత్, కెత్త రవి, బొల్లం రాజిరెడ్డి, డాన్ తిరుపతి రెడ్డి, ఇనగాల భిక్షపతి, వాసాల శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు ఆకనపల్లి భిక్షపతి, సముద్రాల కృష్ణ, లింగయ్య, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి ఆడెపు శ్రీకాంత్, పైసా శరత్, మండల యువజన శాఖ వైస్ ప్రెసిడెంట్ చేరాలా రోహిత్, ఎంబడి తేజ, ప్రధాన కార్యదర్శి గాలిబ్ నవీన్, కార్యదర్శి ఎండి ఆసిఫ్, మారేపల్లి సత్యపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరశురాములు, యుగేందర్, బండి కుమారస్వామి, చంద్రమౌళి, కనగంటి కుమారస్వామి, శనిగరపు రమేష్, మొగులయ్య, రమేష్, శోభన్, కుమార్, తిరుపతి గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ స్థాయి నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పారిశుద్ధ్య సమస్యలపై కమిషనర్‌కు ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణ పరిధిలోని 9వ వార్డులో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై కాంగ్రెస్ పార్టీ 9వ వార్డు ఇంచార్జ్ దార్న వేణుగోపాల్ బుధవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ సుష్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ, 9వ వార్డులో సైడ్ డ్రైనేజీలు, దామెర చెరువు మత్తడి కాలువలో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని కోరారు. అలాగే, వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కమిషనర్ సుష్మ, సంబంధిత సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేశారు.

# కలకోటి రాజేందర్ దశదిన కర్మకు హాజరైన ప్రముఖులు



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండల కేంద్రానికి చెందిన న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ అన్నకలకోటి రాజేందర్ ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన దశదిన కర్మ కార్యక్రమానికి పలువురు ప్రజాసంఘాల నాయకులు, కళాకారులు హాజరయ్యారు. ప్రజాసంఘాల జేఏసీ ములుగు జిల్లా చైర్మన్ ముంజాల భిక్షపతి గౌడ్, పల్లె పాటల కవి, రచయిత డాక్టర్ వెన్నెల శ్రీనాథ్ తదితరులు హాజరైన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు న్యాయవాది కలకోటి మహేందర్‌తో పాటు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళా నాయకులు గోల్కొండ బుచ్చన్న, రేలా కుమార్, డప్పు రమేష్, ప్రజా సంఘాల నాయకులు నరేష్, ఐలయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం కుట్ర

◆ మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) స్టేషన్ ఘనపురం నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తగ్గించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇంద్రపార్కు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు రఘునాథపల్లి మండలం నుంచి వై.కుమార్ గౌడ్ నాయకత్వంలో పలువురు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఈ ధర్నా చేపట్టిందని అన్నారు. పార్లమెంటులో బిల్లు ఆమోదిస్తేనే ఈ విషయం పరిష్కారమవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలుసన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి జరుగుతున్న కుట్రలో ఇది భాగమేనని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కంచనపల్లి మాజీ ఎంపీటీసీ గవాని నాగేశ్వరరావు, బండి కుమార్, ముప్పిడి సాంబ, పెరబోయిన పరుశరామ్, బాల్నే పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, జూలై 15, 2025

# ఎంజీఎం పీపీ యూనిట్ తనిఖీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంజీఎం ఆసుపత్రిలోని అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ పీపీ యూనిట్ను వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బీ. సాంబశివరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సాంబశివరావు మాట్లాడుతూ, పేద ప్రజలకు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని సిబ్బందిని కోరారు. ముఖ్యంగా పట్టణంలో పర్యటించినప్పుడు పరిసర ప్రాంతాలను నిశితంగా పరిశీలించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించిన ఆయన, జ్వరాల పట్ల ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ ఎం. యశస్విని, సూపర్వైజర్ నర్మద, రామ రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ నాయకుడిని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మండల కో–ఆప్షన్ మెంబర్, మైనార్టీ నాయకులు ఎండీ. జాఫర్ రిజ్విని నేడు పలువురు కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. గత వారం రోజులుగా అపెండిక్స్ వ్యాధితో హనుమకొండలోని వాసవి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న జాఫర్ రిజ్విని సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించి, త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు చిన్నాల గోనాథ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్, ఎన్ఎస్‌యూఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మడికొండ శ్రీను తదితరులు ఉన్నారు.

# నటుడు కోట శ్రీనివాసరావుకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్:** దివంగత చలనచిత్ర నటుడు కోట శ్రీనివాసరావుకు వరంగల్లో ఘన నివాళులర్పించారు. పోచమ్మ మైదాన్ సెంటర్లో శ్రీ బాలాజీ క్రియేషన్స్ అధినేత డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆడెపు రవీందర్ మాట్లాడుతూ కోట శ్రీనివాసరావు 1978లో చలనచిత్ర రంగంలో ప్రవేశించి దాదాపు 750 సినిమాలలో నటించారని గుర్తు చేశారు. ఆయన ఒకసారి శాసనసభ్యుడిగా గెలిచి, పద్మశ్రీ అవార్డును అందుకున్న గొప్ప నటుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కళాకారులు, కళా సంస్థల అధినేతలు, కళా పోషకులు తదితరులు పాల్గొని కోట శ్రీనివాసరావుకు శ్రద్ధాంజలి ఘటించారు. పాల్గొన్న వారిలో తోట పూర్ణచందర్రావు (పీసీఆర్ ప్రొడక్షన్స్ అధినేత), జడల శివ హరిత (జేపీ క్రియేషన్స్ అధినేత), ఆలేటి శ్యామ్ (రోజా క్రియేషన్స్ అధినేత), ఎర్ర కోటేశ్వర్, ఆకుతోట లక్ష్మణ్ (మయూరి ఆర్ట్ క్రియేషన్స్), ఎనమలపల్లి నాగరాంచందర్, అట్లూరి శ్రీకాంత్ (భద్రకాళి ఆర్ట్ క్రియేషన్స్ అధినేత), పోలపాక యాదగిరి, కళా శ్రీనివాస్, పుల్లబోయిన నాగరాజ్, గర్రెపల్లి ప్రభాకర్, జూలూరి పెద్ద పున్నారావు, పీ.ఆర్. ప్రసాద్, రేణుకుంట్ల అనిల్, వీరన్న, రాజేంద్ర ప్రసాద్, గజ్జి దినకర్ ఉన్నారు.

# ఆధిపత్య కులాల రాజ్యం ఇంకెంతకాలం ?

◆ బహుజన రాజ్యం కోసం సమరభేరి మోగిద్దాం
◆ బత్తిని సదానందం, గుంటి రాజేందర్ పిలుపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** 78 సంవత్సరాల స్వతంత్ర భారతంలో వెనుకబడిన తరగతులు (బీసీలు) మరింత పేదరికంలోకి నెట్టివేయబడ్డారని, ఎగువ కులాల వివక్షకు గురైన బీసీలంతా ఐక్య ఉద్యమాలకు సన్నద్ధం కావాలని హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా కార్యదర్శి బత్తిని సదానందం, జిల్లా సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా బత్తిని సదానందం, గుంటి రాజేందర్ మాట్లాడుతూ సమగ్ర సర్వేలో బీసీలు 56.33 శాతం ఉన్నారని తేల్చినప్పటికీ, పాలకులు ఆ మేరకు రాజకీయ, విద్యా, ఉద్యోగ, రాజ్యాంగ పదవులు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. బీసీల అభివృద్ధి కోసం వనరులు, కాంట్రాక్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలుకై 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కొరకు ఆర్డినెన్స్ తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి షెడ్యూల్ తొమ్మిదిలో వచ్చేటట్లు అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం సీలింగ్ రిజర్వేషన్ అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. సంపద సృష్టిలో బీసీలు వెన్నెముకగా, ఉత్తమ తరగతిగా ఉన్నప్పటికీ, పాలకవర్గాలు ఉద్దేశపూర్వకంగా వారిని వెనక్కి నెట్టివేశాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఉండాలని, సంక్షేమం రాజ్యాంగ హక్కు అని, అభివృద్ధి పౌర హక్కు అని స్పష్టం చేశారు. బీసీల రాజ్యాధికారం కొరకు దేశవ్యాప్త ఉద్యమానికి బహుజనులంతా ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోడం రాజేందర్, పొనుగోటి రామ్, గోపాలచారి, హర్షం సుధాకర్ పాల్గొన్నారు.

# బీసీ బాలికల హాస్టల్‌కు వాటర్ ఫిల్టర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్‌కు బాసని శంకరయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు వినయ భూషణ్, శైలేష్ కుమార్ వాటర్ ఫిల్టర్‌ను బహుకరించారు. శంకరయ్య సోదరుడు బాసని సుబ్రహ్మణ్యం మంగళవారం హాస్టల్‌కు వెళ్లి రూ. 25,000 విలువైన ఈ వాటర్ ఫిల్టర్‌ను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుష్మాకు అందజేశారు. ఫిల్టర్ బిగించిన తర్వాత, హాస్టల్ బాలికలకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా హాస్టల్ బాలికలు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయ చైర్మన్ సామల భిక్షపతితో పాటు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దిశ కమిటీ వైస్ చైర్మన్ గా లాలు నాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మానుకోట జిల్లా దిశ కమిటీ జిల్లా వైస్ చైర్మన్‌గా గుగులోత్ లాలు నాయక్ నియమితులయ్యారు. భారత ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు, పథకాల పర్యవేక్షణకు ఈ కమిటీ కృషి చేస్తుంది. ఈ సందర్భంగా గొల్లచర్ల గ్రామ సమీపంలోని కస్నతండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లాలు నాయక్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ బలరాం నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# మిలీనియం లయన్స్ క్లబ్ చేయూత



**వరంగల్ వాయిస్, జనగామ:** లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. లయన్ పూర్వ జోన్ చైర్మన్ ఎలికట్టే నరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఏబీవీ హైస్కూల్‌లో విద్యార్థులకు 250 నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే, రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో 30 మంది వృద్ధులకు అల్పాహారం అందించారు. క్లబ్ అధ్యక్షుడు బండ భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి ఒక్కరూ తమ జన్మదినం సందర్భంగా అవసరార్థులకు సహాయం చేయాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి దాసరి సుమన్, పూర్వ అధ్యక్షులు గాదే నర్సింహులు, క్లబ్ పీఆర్వో ఏనుగు నర్సిరెడ్డి, కృష్ణమోహన్, నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


# డ్రంకెన్ డ్రైవ్ లో ఇద్దరికి జరిమానా

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు కొరడా ఝుళిపించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీ అబ్బోజు వెంకటేశం ఒక్కొక్కరికి రూ. 2,000 చొప్పున జరిమానా విధించారు. అదేవిధంగా, డ్రంకెన్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన 34 మందికి మొత్తం రూ. 42,100 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

◆ దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇచ్చే ప్రతిభా పురస్కారాలకు విశ్వబ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వోపా అధ్యక్షులు శ్రీరామోజు నాగరాజారావు, ప్రతిభా పురస్కారాల కన్వీనర్, వోపా అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ తెలిపారు. మంగళవారం హనుమకొండ రెడ్డి కాలనీలోని వోపా కార్యాలయంలో ముఖ్య నాయకులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థినీ, విద్యార్థులు మాత్రమే ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. విద్యార్థులు తమ దరఖాస్తుతో పాటు, మార్కుల సర్టిఫికెట్, బోనఫైడ్ లేదా కండక్ట్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జూలై 30 లోగా 9440313745 నంబర్‌కు పంపాలని సూచించారు. గడువులోగా అందిన దరఖాస్తులలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి నగదు, ప్రశంసా పత్రం అందించి శాలువాతో ఘనంగా సత్కరించనున్నట్లు వోపా ప్రతినిధులు తెలిపారు. అవసరాన్ని బట్టి ప్రోత్సాహక బహుమతులు కూడా ఇవ్వబడతాయని, ప్రతిభా పురస్కారాల ఎంపికలో కమిటీదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థుల వివరాలు,



పురస్కారాలు ఇచ్చే తేదీ, వేదిక త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వోపా ప్రధాన కార్యదర్శి మహేశ్వరం భిక్షపతి, కోశాధికారి శ్రీరామోజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ సాధనకై పోరాటాలకైనా సిద్ధం

● తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్రాములు ప్రసంగించారు. బీసీలకు స్థానిక సంస్థలలో, విద్యా ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ల కోసం శాసనసభలో బిల్లులు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపి నెలలు గడుస్తున్నా కేంద్రం స్పందించకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఇద్దరు బీజేపీ కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు ఎందుకు ప్రధానమంత్రిని ఒప్పించలేకపోతున్నారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రంలో బీజేపీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి ప్రసంగిస్తూ, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను, బీసీ సంఘాల ప్రతినిధులను అఖిలపక్షంగా ఢిల్లీకి ప్రధానమంత్రి దగ్గరికి తీసుకు వెళ్లి ఒప్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలు నీటి మూటలే అయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ప్రత్యేక బాధ్యత తీసుకొని బీసీల రిజర్వేషన్లు అమలయ్యేటట్లుగా చర్యలు చేపట్టాలని, లేనిచో బీసీల ఆగ్రహాన్ని చవి చూడవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు మేడిది అశోక్, చీకటి ప్రకాష్, చంద్రశేఖర్ చారి, గొడిశాల రాజు, వలబోజు కృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# లాదెళ్లలో ఉచిత ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ జిల్లా దామెర మండలంలోని లాదెళ్ల గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. లాదెళ్లలోని రూరల్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రక్తపోటు (బీపీ), షుగర్ వంటి రక్త పరీక్షలు నిర్వహించి, 52 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, పాలకవర్గం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా. జె. కిషన్ రావు, డా. మొహమ్మద్ తయార్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, ఎ.గంగాధర్, సతీష్, శ్రీకాంత్, నర్సింహ చారి, కిట్స్, వరంగల్ విద్యార్థి జి.వర్షిత్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల మనిషి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** చట్టసభలో ప్రశ్నించే గొంతుకగా పేరుపొందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే తీవ్రంగా ఖండించారు. మంగళవారం హైదరాబాద్‌లోని క్యూ న్యూస్ కార్యాలయంలో గాయపడిన తీన్మార్ మల్లన్నను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కల్వకుంట్ల కవిత గుండాలు క్యూ న్యూస్ కార్యాలయం, తీన్మార్ మల్లన్న, ఆయన బాడీగార్డ్‌పై దాడి చేశారని కుమార్ గాడ్గే ఆరోపించారు. గాయపడిన తీన్మార్ మల్లన్న ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. ఈ దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని, కల్వకుంట్ల కవిత శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వకీల్ సాబ్ రాచకొండ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు రానున్న ఎన్నికల్లో బీసీలకు రాజకీయ అధికారం సాధించి పెట్టేలా తీన్మార్ మల్లన్నతో కలిసి మేధావులు, విద్యావంతులు, బీసీ సంఘాలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి హత్యకాండలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకొని, దుండగులను తక్షణమే శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. పరామర్శించిన వారిలో జర్నలిస్టు గట్ల శ్రీనివాస్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షం సమృద్ధిగా కురవాలని వరుణ దేవుడి పూజ

గ్రామోత్సవంగా కప్పతల్లి ఆట



**వరంగల్ వాయిస్, గణపురం:** సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ వరుణ దేవునికి పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ గణపురం గ్రామ రైతులు, యువకులతో కలిసి కప్పతల్లి ఆటను గ్రామోత్సవంగా నిర్వహించారు. గణపురం పురవీధుల్లో డప్పుల సప్పులతో, బిందెల నిండా నీటితో వరుణ దేవుడిని పూజిస్తూ ఊరేగింపుగా వెళ్లారు. ఈ ఊరేగింపులో మొదట గ్రామ దేవతలైన భూలక్ష్మి అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ఆ తర్వాత పోచమ్మ తల్లికి అభిషేకం చేశారు. కప్పతల్లి ఆట గణపసముద్రం చెరువుకట్టపై గల దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవాలయం వరకు కొనసాగించి, తిరిగి రామాలయం వరకు చేరుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో శ్రీరామ భక్తులు, ప్రజలు, రైతులు, మహిళలు సంతోషంగా పాల్గొని వర్షాలు సమృద్ధిగా కురిసి, పంట దిగుబడి బాగా ఉండాలని వరుణ దేవునికి పూజలు చేశారు.

# బాధిత ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, రేగొండ:** ఫొటోగ్రాఫర్‌ల సంక్షేమం కోసం నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా అధ్యక్షుడు రఘోత్తం రెడ్డి తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. మంగళవారం రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ సింగరి కిరణ్ ఇటీవల బైక్ పైనుంచి కిందపడి కాలు ఫ్రాక్చర్ కావడంతో, ఈ విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు బండ రఘోత్తం రెడ్డి అతనికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. "ఫోటోగ్రాఫర్లకు ఆపద వస్తే నేనున్నానని" భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ మండల అధ్యక్షులు జంబుల రఘు, ఫోటోగ్రాఫర్స్ జిల్లా కోశాధికారి ఎల్దండి రాకేష్, టేకుమట్ల మండల ఫోటోగ్రాఫర్స్ అధ్యక్షులు దాసారపు సదానందం, ప్రధాన కార్యదర్శి గుగులోతు రాజేందర్ నాయక్, కోశాధికారి బండి కమలాకర్, రేగొండ ఫోటోగ్రాఫర్స్ మోరే మొగిలి, మల్లెబోయిన స్వామి, సింగరి సతీష్, సామల సురేందర్ రెడ్డి, కోల రాజు, చుక్క ప్రశాంత్, పబ్బ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి బుధవారం పలువురిని పరామర్శించారు. పరకాల మండలం నాగారం గ్రామంలో ఇటీవల మరణించిన బొమ్మరాజు రాజమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లక్కపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ అధ్యక్షులు బొజ్జమ్ రవి తండ్రి సారయ్య గారిని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. అంతేకాకుండా, పరకాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ, కౌన్సిలర్ చందుపట్ల తిరుపతి రెడ్డి తల్లి చందుపట్ల రాధమ్మ గారి ప్రథమ వర్ధంతిలో పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువకుల పైనే దేశ భవిష్యత్తు

◆ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు



**వరంగల్ వాయిస్, జనగామ:** భారతదేశ భవిష్యత్తు యువకులపై ఆధారపడి ఉందని, యువత తమలో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జనగామ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జనగామ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.వరంగల్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా దూసుకెళ్లాలంటే నైపుణ్యాభివృద్ధి తప్పనిసరని, కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా ప్రతి రంగంలో ముందుకు సాగాలంటే నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నప్పుడే ప్రతి యువకుడు బంగారు భవిష్యత్తును ఏర్పరుచుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. నెహ్రూ యువ కేంద్రం పూర్వపు వాలంటీర్ మంద రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత లక్ష్యం వైపు దూసుకెళ్లి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుకోవాలని అన్నారు. ఇటీవల డ్రగ్స్ వంటి వాటితో యువత పెడదారి పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తూ, యువత బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రపంచ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిని ఆదిత్యకు, ద్వితీయ బహుమతిని దిలీప్‌కు, తృతీయ బహుమతిని విష్ణుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరేందర్, సదానందం, రాజు తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, జూలై 15, 2025

# బోనాల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయండి

## మేయర్ గుండు సుధారాణి ఆదేశం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నగరవ్యాప్తంగా జరగనున్న శ్రావణ మాస పోచమ్మ బోనాల పండుగకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఇంజనీరింగ్ విభాగ అధికారులతో త్వరలో జరుగనున్న శ్రావణ మాస పోచమ్మ బోనాల నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, శ్రావణ మాసంలో పోచమ్మ బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగరంలోని అన్ని ఆలయాలకు లైటింగ్ ఏర్పాట్లతో పాటు అంతర్గత రహదారులకు డస్టింగ్ వేయాలన్నారు. బల్దియాలోని 66 డివిజన్లలో పలు పథకాల క్రింద కొనసాగుతున్న అభివృద్ధి పనులపై డివిజన్లవారీగా ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి సకాలంలో పూర్తి చేయాలని, టెండర్ ప్రక్రియలో ఉన్న పనులను త్వరగా మొదలుపెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్.ఈ. మహేందర్, ఈ.ఈ.లు శ్రీనివాస్, రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లతతో పాటు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



### వరంగల్‌లో సానిటేషన్ ఆకస్మిక తనిఖీ..

నగర మేయర్ గుండు సుధారాణి మంగళవారం ఆకస్మికంగా సానిటేషన్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ వరంగల్ జెమిని టాకీస్ ప్రాంతంలో జేసీబీ ద్వారా డ్రైన్‌లో కొనసాగుతున్న పూడికతీత పనులను పరిశీలించి, సమర్థవంతంగా చేపట్టుటకు సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో డ్రైన్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా వర్షపు నీరు నిలవకుండా సాఫీగా వెళ్ళిపోయే అవకాశం ఉంటుందన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

## కార్పొరేటర్ మామిండ్ల రాజు



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** నగరంలోని 31వ డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, విద్యార్థులకు విద్యను అభ్యసించేందుకు అనువైన సౌకర్యాలను కల్పించేందుకు స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు కృషి చేస్తున్నారు. ఈ కృషిలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్రకృతి వనంతో పాటు ఆట స్థలం ఏర్పాటు చేసే పనులను చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తన పూర్తి తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు ఉప్పలయ్య, ఆచార్య బృందం, పాఠశాల చైర్మన్ వెనుకంటి రవళి, గ్రామ గ్రంథాలయ నిర్వాహకుడు వెనుకంటి రాకేష్, కోడం సురేష్, మన ఊరు మనబడి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై మోసం చేస్తున్న కాంగ్రెస్




**వరంగల్ వాయిస్, తొర్రూరు:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు మద్దతుగా మంగళవారం బీసీ ఫెడరేషన్ (బీసీపీఎఫ్) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కులో నిర్వహించిన 'సింహగర్జన'కు తొర్రూరు మండల, తొర్రూరు పట్టణ బీఆర్ఎస్ పార్టీ, బీసీపీఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు నలమాస ప్రమోద్ గౌడ్, కుర్ర శ్రీనివాస్ గౌడ్, ఫ్యాక్స్ డైరెక్టర్ కల్వకోలను జనార్దన్ రాజు, తొర్రూరు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు యర్రం రాజు యాదవ్, సీనియర్ నాయకులు భూసాని ఉప్పలయ్య యాదవ్, దొనికెన కుమారస్వామి, నిమ్మల శేఖర్ గౌడ్, బోలగాని వెంకన్న గౌడ్, పల్లె యాకన్న గౌడ్, గుంజి రవి, సముద్రాల శీను, కోట వెంకటేశ్వర్లు, గజ్జల వెంకన్న, కుర్ర నరేష్, నలమాస సంపత్ గౌడ్, ప్రభాకర్, సాయికుమార్, నాగరాజు, రెడ్డబోయిన నరేష్, చిర్ర రాజు, చింతల రాజు, నగరబోయిన భద్రయ్య, సతీష్, శివమణి, దీకొండ కృష్ణ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారానే సీజనల్ వ్యాధులకు స్వస్తి పలకవచ్చని ఆబాది జమ్మికుంట మాజీ కౌన్సిలర్ తెలిపారు. బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ కార్తికేయ హాస్పిటల్ వైద్యులు మంగళవారం ఆబాది జమ్మికుంట గ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ముక్కా శరత్ బాబు, డాక్టర్ ముక్కా మౌనిక మాట్లాడుతూ, వ్యాధులు సోకిన తర్వాత వైద్యానికి వెళ్లే బదులు, వాటి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా, వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని అన్నారు. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి ప్రాణాంతక వ్యాధులను కూడా ఇలా నివారించవచ్చని వారు వివరించారు. బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ, మహిళలు చైతన్యవంతం అయినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఆవిర్భవిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ సుమలత, శ్రీ కార్తికేయ హాస్పిటల్ స్టాఫ్ రమేష్, సాంబయ్య, అలేఖ్య, శృతి, ఏఎన్ఎం సరళ, ఆశా వర్కర్లు రమ, పద్మ, ముఖ్య అతిథులుగా దయ్యాల శ్రీనివాస్, అయితా అశోక్, దొడ్డే శ్రీకాంత్, పోడేటి అనిల్ మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

## మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** భూ కబ్జాలకు పాల్పడిన వారే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జమ్మికుంట మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య అన్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ, గత కొంతకాలంగా గ్రామంలో రాజకీయంగా తనంటే గిట్టని కొందరు కలిసి, తాను భూమి కబ్జా చేశానని తప్పుగా ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో కోరపల్లిలో జమ్మికుంట మండలం తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన భూభారతి కార్యక్రమంలో బ్యానర్ పట్టుకొని తనపై అసత్య ప్రచారం చేశారని సమ్మయ్య పేర్కొన్నారు. అయితే, బ్యానర్ ప్రదర్శించిన వారే భూ కబ్జాలకు పాల్పడ్డారని, వారి అన్ని వివరాలను సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు. మండల్ తాసిల్దార్ కార్యాలయం నుంచి సమాచార హక్కు చట్టం ప్రకారం వారి కబ్జాల బాగోతం బయటపడిందని, త్వరలో వాటిని పత్రికా ముఖంగా చూపిస్తానని అన్నారు. వీరంతా ఒక గ్రూపుగా ఏర్పడి తప్పుడు రెవెన్యూ రికార్డులను మార్చి, భూ కబ్జాలకు పాల్పడి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడమే కాకుండా, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సమ్మయ్య ధ్వజమెత్తారు. తనపై పబ్లిక్‌లో సోషల్ డ్యామేజ్ చేస్తున్నారని, వారిపై పరువు నష్టం దావా వేశానని, నోటీసులు కూడా అందినట్లు పేర్కొన్నారు. త్వరలో వారిని కోర్టుకు కూడా ఈడుస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# మా వాటా.. మా న్యాయమైన హక్కు

## దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** బీసీల మహాధర్నా కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక నిర్వహించిన "హలో బీసీ చలో హైదరాబాద్" మహాధర్నా కార్యక్రమానికి ఆయన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీల ఓట్లు దండుకొని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కానీ నేడు బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయమంటే మాత్రం నాటకాలు ఆడుతోందని విమర్శించారు. "మేమెంతో మాకు అంత వాటా రావాలని డిమాండ్ చేస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆర్డినెన్స్‌ల పేరుతో కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధం చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గ్రూప్–1, 2, 3, 4, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్లకు సంబంధించిన ఫౌండేషన్ కోర్సు కోసం 150 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ ఇన్చార్జ్ డైరెక్టర్ ఎస్.లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 16 నుంచి ఆగస్టు 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో లక్ష రూపాయలకు మించకూడదని, అలాగే పట్టణ ప్రాంతంలో రెండు లక్షల రూపాయల వరకు మించకూడదని స్పష్టం చేశారు. ఎంపిక విధానం డిగ్రీ పరీక్షలో అత్యధిక మార్కుల ఆధారంగా, అలాగే రిజర్వేషన్ నియమం ప్రకారం ఉంటుందని లక్ష్మణ్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున ఐదు నెలల పాటు స్టైఫండ్ మంజూరు చేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 0870 – 2571192, 040–2407118 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

# మంత్రి గడ్డం వివేక్‌ను కలిసిన కుడా చైర్మన్ ఇనగాల



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్ర కార్మిక, ఎంప్లాయ్‌మెంట్, మైనింగ్ శాఖ మంత్రిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం వివేక్ ను వరంగల్ కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ తన ఛాంబర్‌లో ఉండగా, వెంకట్రామ్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు అందజేశారు.

# చందుపట్ల రాధమ్మ సంస్మరణ సభ

## హాజరైన పరకాల జర్నలిస్టులు



**వరంగల్ వాయిస్, పరకాల:** స్థానిక పురపాలక సంఘం 15వ వార్డు మాజీ కౌన్సిలర్, మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చందుపట్ల సాయి తిరుపతి రెడ్డి తల్లి చందుపట్ల రాధమ్మ సంవత్సరీక వేడుకలకు పరకాల జర్నలిస్టులు మంగళవారం హాజరయ్యారు. మొదట ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు భలేరావు బాబ్జి, నేరెళ్ల పరుశురామ్, బచ్చు పురుషోత్తం, దాసరి రమేష్, అంకెశ్వరపు ఐలయ్య, ఎండి పాషా, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పార్ట్–2 మరింత పవర్‌ఫుల్

ప్రమోషన్లలో పాల్గొంటున్న నిధి అగర్వాల్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా రూపొందిన చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రం 'హరి హర వీరమల్లు'జులై 24న గ్రాండ్ రిలీజ్ కానుంది. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో పవన్ అంత యాక్టివ్‌గా పాల్గొనడం లేదు. దర్శకుడు క్రిష్ మిడ్‌స్టేజ్‌లో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న నేపథ్యంలో ఆయన కూడా ప్రమోషన్ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. జ్యోతికృష్ణ ప్రస్తుతం ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకుల్లో ఆయనకు గుర్తింపు తక్కువగా ఉండడంతో పెద్దగా బజ్ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మొత్తం ప్రమోషన్ బరువు బాధ్యతలు నిధి అగర్వాల్ భుజాలపై పడిరది. పంచమి పాత్రలో మెప్పిస్తున్న నిధి, గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ సినిమాపై భారీ నమ్మకంతో ఎదురుచూస్తోంది. ఈ సినిమాతో ఆమె రేంజ్ మారుతుందని ఫ్యాన్స్ కూడా భావిస్తున్నారు. ఇక సినిమాకి సంబంధించిన ప్రతి ప్రమోషన్ కార్యక్రమంలో నిధి యాక్టివ్‌గా పాల్గొంటుంది. తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి అగర్వాల్, 'హరి హర వీరమల్లు'తో పాటు – పార్ట్ 2 గురించి కూడా కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడిరచింది. మొదట సినిమాను ఒకే పార్ట్‌గా రూపొందించాలనుకున్నప్పటికీ, కథ విస్తృతంగా ఉండటంతో రెండు భాగాలుగా చేయాలని నిర్ణయించారని తెలిపింది. ఇప్పటికే పార్ట్ 2కి సంబంధించిన 20 నిమిషాల సీన్స్ షూట్ పూర్తయ్యాయని చెప్పి అభిమానులని ఆనందింపజేసింది. నిధి చెప్పిన ప్రకారం, వీరమల్లు పార్ట్ 2లో కూడా ఆమె కీలక పాత్రలో కనిపించనుంది. అలాగే, రెండో భాగం మరింత పవర్‌ఫుల్‌గా ఉంటుందని తెలియజేసింది. అయితే షూటింగ్ మిగతా భాగం ఎప్పుడవుతుందనేది మాత్రం ఇంకా స్పష్టత లేదు. పవన్ రాజకీయాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో పార్ట్ 1 హిట్ అయితేనే పార్ట్ 2పై క్లారిటీ – వచ్చే అవకాశం ఉంది. ఏఎం రత్నం నిర్మాణంలో, క్రిష్ మరియు జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.



# జానకి వర్సెస్ కేరళ పేరు మార్పు

మలయాళంలో అనుపమ పరమేశ్వరన్, సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన కోర్ట్‌రూమ్ డ్రామా చిత్రం జానకి వర్సెస్ కేరళ టైటిల్ చుట్టూ నెలకొన్న వివాదం చివరకు ముగిసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సూచనలతో మేకర్స్ –టైటిల్ మార్చేందుకు అంగీకరించారు. 'జానకి వర్సెస్ కేరళ' అనే టైటిల్ రాష్ట్రాన్ని లక్ష్యం చేస్తుందని కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో టైటిల్ మార్పును సూచించగా, దాన్ని నిర్మాతలు ఆమోదించారు. దీంతో సినిమా కొత్త టైటిల్‌గా 'జానకి వి స్టేట్ ఆఫ్ కేరళ' ను ఫిక్స్ చేశారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ట్రైలర్ ఇటీవల విడుదలైంది. ఇందులో కథానాయిక జానకి విద్యాదరన్ (అనుపమ పరమేశ్వరన్) పై జరిగే లైంగిక దాడి, ఆ తర్వాత ఆమె న్యాయానికి కోసం చేసే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఇది సమాజంలో మహిళల ఎదుర్కొంటున్న సమస్యలను హైలైట్ చేస్తూ, చట్ట వ్యవస్థపైనా ఓ బలమైన సందేశం ఇస్తుందని అర్థమవుతోంది. ఈ చిత్రంలో దివ్య పిళ్ళై, శృతి రామచంద్రన్, అస్కర్ అలీ, మాధవ్ సురేష్ గోపి, బైజు సంతోష్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కాస్మోస్ ఎంటర్–టైన్‌మెంట్స్ పతాకంపై జె. ఫణీంద్ర కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. త్వరలో సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు.

# ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ పౌరాణిక చిత్రం



## విషయాలు వెల్లడించిన నాగవంశీ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినీ కెరీర్‌లో దూసుకుపోతున్నాడు. గతేడాది దేవర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తారక్ మరికొన్ని రోజుల్లో వార్ 2 చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాతో బాలీవుడ్ మార్కెట్‌లోనూ తన సత్తా చాటనున్నాడు. హృతిక్ రోషన్‌తో కలిసి చేస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఆగష్టు 15న విడుదల కానుండగా, అభిమానులు సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇదే కాకుండా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హై–వోల్టేజ్ యాక్షన్ ఎంటర్–టైనర్ ఒకటి చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా.. దీనికోసం ఎన్టీఆర్ బరువు కూడా చాలా తగ్గాడు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ శ్రీనివాస్ ఒక సినిమా చేయబోతున్నట్లు– వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. మైథాలాజికల్ మూవీగా రానున్న ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించబోతున్నాడు. సుబ్రహ్మణ్య స్వామి కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్ విషయాల గురించి పంచుకున్నాడు నాగవంశీ. త్రివిక్రమ్ మొదటిసారి మైథలాజికల్ సినిమా చేస్తున్నారు. అందుకే ఈ సినిమాను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మధ్యలో ఈ సినిమా లాంఛింగ్‌తో పాటు శరవేగంగా షూటింగ్ ఉంటుంది. త్రివిక్రమ్– వెంకటేశ్ సినిమా ఆగస్టు నుంచి ఈ సినిమా ప్రారంభం అవుతుంది. ఇది పూర్తయిన తర్వాతే ఎన్టీఆర్ ప్రాజెక్ట్ మొదలవుతుందని తెలిపాడు . ఇక విజయ్ దేవరకొండను ప్రేక్షకులు ఎందుకు టార్గెట్ చేస్తారో కూడా తెలియదని నాగవంశీ అన్నారు. ఆయన ప్రస్తుతం తన సినిమాలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేకపోతున్నాయని బాధ పడుతున్నట్లు– చెప్పారు. ఆయన ఏం మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అన్నారు.



# కుబేరనుంచి శంకరా సాంగ్ విడుదల



జూన్‌లో బాక్సాఫీసు ముందుకొచ్చి, ప్రేక్షకాదరణ పొందిన సినిమాల్లో 'కుబేర' ఒకటి. నాగార్జున , ధనుష్ , రష్మిక ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ఈ నెల 18 నుంచి ఓటీటీ– 'అమెజాన్ ప్రైమ్ వీడియో' లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో.. చిత్ర బృందం ఆడియన్స్‌కు సర్‌ప్రైజ్‌లు ఇస్తోంది. ఈ సినిమాలోని సాంగ్స్ ఫుల్ వీడియోలను రిలీజ్ చేస్తోంది. 'నాది నాది నాదే ఈ లోకమంతా' వీడియో సోమవారం విడుదల కాగా.. 'శంకరా' వీడియో సాంగ్ మంగళవారం విడుదలైంది.



# ఘనంగా శ్రీదీప్ ఆర్యన్ పుట్టినరోజు వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ వాయిస్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి–సంధ్యారాణి దంపతుల కూతురు మామిడి ఉష్రశ్రీ–ప్రదీప్ దంపతుల కుమారుడు శ్రీదీప్ ఆర్యన్ మూడో సంవత్సరం పుట్టినరోజు వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. హనుమకొండలోని కేశవమూర్తి స్వగృహంలో జరిగిన ఈ వేడుకల్లో శ్రీదీప్ ఆర్యన్‌ను నానమ్మ–తాత మామిడి అరుణ–సుదర్శన్, మేనమామ–అత్త గడ్డం సాహిత్–కావ్య, బూర రామనాధం–కృష్ణవేణిలు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎన్.మూర్తి, బొజ్జం చొక్కారావు, మైదంశెట్టి సాంబయ్య, పూజారి విజయ్, పూజారి శ్రీను, జంపాల మధు, జర్నలిస్టులు సామల సూర్యప్రకాశ్, గోలి రవి, బంధుమిత్రులు తదితరులు హాజరై శ్రీదీప్ ఆర్యన్‌ను ఆశీర్వదించారు.




# పనులు సకాలంలో పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వరంగల్ కలెక్టరేట్ నిర్మాణ పనుల పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాల నిర్మాణ పనుల్లో వేగం పెంచి గడువులోగా పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. పనులు నత్త నడకన సాగడంపై అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం వరంగల్ లోని పాత ఆజంజాహి మిల్స్ గ్రౌండ్ లో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయాలను డాక్టర్ సత్య శారద సందర్శించి పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. మూడు అంతస్తుల నిర్మాణాలను, కలెక్టర్ క్వార్టర్స్, అడిషనల్ కలెక్టర్ క్వార్టర్స్ మొదటి, రెండో అంతస్తులలో డిజైన్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అంటూ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్ట్రక్చరల్ పనులు పూర్తయినందున పినిషింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైన సిబ్బందిని, వనరులను వియోగించుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాంపౌండ్ వాల్, పైప్ లైన్ తదితర నిర్మాణ పనులను కూడా ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, రోడ్లు, భవనాల శాఖ అధికారి రాజేందర్, డీఈ శ్రీధర్, నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెత్త తరలింపు వాహనాల మానిటరింగ్ తప్పనిసరి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ఐసీసీసీ కేంద్రం క్షేత్ర స్థాయి సందర్శన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చెత్త తరలింపు వాహనాల మానిటరింగ్ ను తప్పనిసరి చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి నిర్వహిస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఐసీసీసీ పనితీరును వివరిస్తూ వేరియబుల్ మెసేజ్ డిస్ప్లే, పెలికాన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, జీఐఎస్ డేటా సెంటర్ ఇన్స్పెక్షన్, కమాండ్ కంట్రోల్ సెంటర్, పబ్లిక్ అడ్రస్, సిస్టం ఎన్విరాన్మెంటల్ సెన్సార్ సిస్టం పనితీరును వివరించారు. ఇంటిగ్రేటెడ్ కెమెరాలు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఏసీటీఎస్, ఎన్ఫోర్స్మెంట్ సిస్టమ్ ను పోలీసు విభాగం వారు మానిటరింగ్ చేస్తారని కమిషనర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటి మేనేజర్ రమేష్ మ్యాట్రిక్స్ ఆల్వి ఎటర్నల్ సొల్యూషన్స్ ప్రతినిధులు నరసింహ, నికిషా, బెంజిమెన్, శ్రీధర్, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**శానిటేషన్ తనిఖీలు..**

బల్దియా పరిధి 38వ డివిజన్ ఖిలా వరంగల్ ప్రాంతంలో మంగళవారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శానిటేషన్ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, హెల్త్ ఇన్స్పెక్టర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు కాంగ్రెస్ అండ

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఏడుగురు లబ్ధిదారులకు రూ.6.20 లక్షల విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారుకు ఎంపీ కడియం కావ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేద ప్రజలకు వరం లాంటిదన్నారు. పేదల కోసం నిరంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ పథకం ఇవ్వడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఉద్యమాల నిర్మాణమే దోపిడి నివారణకు మార్గం

- పాలకుల విధానాలతో పెరుగుతున్న అసమానతలు
- ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** పాలకుల విధానాలతో ప్రజల మధ్యన అసమానతలు పెరిగి దోపిడీకి గురవుతున్నారని అందుకు ప్రత్యామ్నాయంగా ఎర్రజెండా ప్రజా ఉద్యమాల నిర్మాణమే ఏకైక పరిష్కారమని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం కామ్రేడ్ మాలోత్ సాగర్, కామ్రేడ్ ముక్కెర రామస్వామి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి కుటుంబాల కార్యకర్తలు, ప్రజలు ఎంసీపీఐ(యూ) పార్టీలో అశోక్ ఓంకార్, గాదగోని రవి, పెద్దారపు రమేష్ ల సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన శంభునిపేటలోని ఆర్ఆర్ గార్డెన్ లో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్దికాయల అశోక్ ఓంకార్ ప్రసంగిస్తూ కమ్యూనిస్టులను, ప్రజా ఉద్యమాలను బలహీనపర్చాలని పాలకులు అన్ని విధాల కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. నిర్బంధాలను ప్రయోగించి కుట్ర కేసులు పెడుతున్నారన్నారు. అయినా సమాజంలో దోపిడి ఉన్నంతకాలం ఎర్రజెండా ఉద్యమాలు ఉంటాయన్నారు. ఎంత అణగదొక్కితే అంతకు రెట్టింపు స్థితిలో బలపడతాయన్నారు. అయితే దోపిడీ వర్గాలకు ఉన్న ఐక్యత కమ్యూనిస్టుల మధ్యన లేకపోవడం పాలకులకు ఒక వరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలోని సంపద అందరికీ సమానంగా దక్కేలా శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా కమ్యూనిస్టులు సామాజిక తరగతులు ప్రజా సంఘాలు ఐక్యంగా ప్రజా ఉద్యమాలను నిర్మిస్తే తప్ప ప్రత్యామ్నాయం లభించదన్నారు. ఈ క్రమంలో ఎంసీపీఐ(యూ) కమ్యూనిస్టులు ఐక్యతకు శక్తివంతం లేకుండా కృషి చేస్తున్నదని, కార్యకర్తల్లో బలహీనతలను లోటుపాట్లను సరిచేసి సరైన దృక్పథంతో ముందుకు సాగుతుందని తెలిపారు. పార్టీలో చేరిన ముఖ్య నాయకులు మాలోత్ ప్రత్యూష గణిపాక ఓదేలు మహమ్మద్ అబ్బు తాటికాయల రత్నం సింగారపు దాసు మాధవి మీరు నిసా రామస్వామి రమేష్ లక్ష్మణ్ ఆశా బేగం అనిల్ సుభాష్ కుమార్ కోటేశ్వర్ యాకయ్య బాబు రాజు రఘుపతి స్వప్న కళ లావణ్య రేణుక ముంతాజ్ ఉమాదేవి తదితరులతోపాటు వెయ్యి మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జిల్లా నాయకత్వం వల్లపు ఉపేందర్ రెడ్డి గోనె కుమారస్వామి ఎన్ రెడ్డి హంసారెడ్డి మంద రవి నర్ర ప్రతాప్ కన్నం వెంకన్న వంగల రాగసుద కనకం సంధ్య మాస్ సావిత్రి గడ్డం నాగార్జున కర్ర రాజిరెడ్డి సుంచు జగదీశ్వర్ నాగెల్లి కొమురయ్య కొత్తకొండ రాజమౌళి మహమ్మద్ ఇస్మాయిల్ లతోపాటు జిల్లా కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com